క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం స్వాతి నక్షత్రం త్రయోదశి తిధి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

దేవస్థానాల వద్ద బల్లల ఏర్పాటు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని దవస్థానాలు, పాఠశాలు, సేవాసమితి వద్ద శనివారం బల్లలను ఏర్పాటు చేశారు. ఈ బల్లలను దత్త గుడి, ఆంజనేయ స్వామి, మాధవ స్వామి, కాకతీయ సేవా సత్రం , ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలల వద్ద ఒక్కో బల్ల రూ. 3 వేల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య చెప్పారు. వీటిని దాతల సౌజన్యంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు శాంతి కల్యాణం

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ శనివారం తెలిపారు. ఈ కళ్యాణాన్ని స్వామివారి జన్మ నక్షత్రం అయిన స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పర్చూరు(చినగంజాం): ఎన్నికల సమయంలో ముస్లింలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇస్తామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ముస్లిం మైనార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఇస్లామిక్ బ్యాంక్‌ను తీసుకొస్తామని అర్హత కలిగిన ముస్లింలందరికీ రుణాలు మంజూరు చేసి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఏర్పాటు చేసే విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

నాలుగు రోజులు సేవలు నిలుపుదల

బల్లికురవ: ఆంధ్రప్రదేశ్ సేవా పోర్టల్ ద్వారా అందిస్తున్న పదిరకాల సేవలను అప్‌గ్రేడ్ చేసే పనిలో భాగంగా మంగళవారం రాత్రి వరకు నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ రవీ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైగ్రేషన్‌లో భాగంగా ఆదాయ, భూమి మ్యుటేషన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పట్టాలు, వృద్ధాప్య, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ నీటి తీరువా, పట్టణ పరిపాలన, మత్స్య శాఖ సేవలు నిలుపుదల చేశారని అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.


రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

అద్దంకి: ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు తమ సహాయ సహకారాలు అందిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం ఒంగోలుకు చెందిన ఆముదాల ప్రకాశ్‌రావు ధర్మపత్ని ఈశ్వరమ్మ స్వామివారి ముఖ మండప నిర్మాణానికి రూ.1,00,116 ఈవో తిమ్మనాయుడుకు అందజేశారు.

ప్రతిభా పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక



మనోహర్‌రెడ్డి, లక్ష్మి, ఎస్తేరు రాణి

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని రాధాస్ గీతం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభా పురస్కార అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. వీరిలో మనోహర్‌రెడ్డి (587), లక్ష్మి (586) ఎస్తేర్‌రాణి (583) అత్యధిక మార్కులు సాధించి ప్రభుత్వం అందజేసే ప్రతిభాపురస్కారాలకు అర్హత సాధించారు. స్కూల్ నిర్వాహకులు ప్రతిభా పురస్కారాలను పొందిన విద్యార్థులను అభినందించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



వేటపాలెంలో మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు



మేదరమెట్లలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కారంచేడు: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని ఆచరించాలని ముస్లిం మత ప్రవక్తలు బోధించారు. శనివారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, దగ్గుబాడు, ఆదిపూడి, స్వర్ణ, కొడవలివారిపాలెం, గ్రామాల్లో ముస్లిం సోదరులు భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కారంచేడు, దగ్గుబాడు ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత బోధకులు ఇస్లాం బోధనలు, అల్లాహ్ ప్రవచనాలను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు ఆహారం, పండ్లు, వస్త్రాలను బహూకరించారు.

మార్టూరు: ముస్లిం సోదరులకు పవిత్ర పర్వదినం అయిన బక్రీద్ పండగను శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం మార్టూరు, వలపర్ల, చిమ్మిరిబండ, బబ్బేపల్లి, కోనంకి, తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు ఉదయం నుంచే పరస్పర అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ గ్రామాల్లోని ఈద్గాల వద్దకు చేరుకొన్నారు. మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పేదలకు ఆర్థిక సాయం చేశారు.

యద్దనపూడి: వేకువజామునే స్నానమాచరించి, కొత్తదుస్తులు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను వారికి వివరించారు. మండలంలోని పూనూరు, గన్నవరం, అనంతవరం, పోలూరు, జాగర్లమూడి యద్దనపూడి గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు ఖుర్బానీ ఇచ్చారు.

పర్చూరు(చినగంజాం): త్యాగానికి ప్రతీకగా చెప్పుకునే బక్రీద్ పండుగను పర్చూరులో ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పవిత్ర స్నానాల అనంతరం వందలాది మంది ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు సామూహికంగా వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. ఉప్పుటూరు, నూతలపాడు, చెరుకూరు, నాగులపాలెంలో బక్రీద్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, ఫేష్ ఇమాంలు, ముతవల్లీలు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

మండలంలోని చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, చింతగుంపల, పెదగంజాంలో పండగను నిర్వహించుకున్నారు, బక్రీద్ పండగ పురస్కరించుకొని ముస్లింలంతా ఉదయాన్నే నిద్రలేచి శుచిగా స్నానమాచరించి, కొత్త బట్టలు ధరించి ఈద్గా వద్దకు నడచి వెళ్లారు. పేదలకు ధానధర్మాలు నిర్వహించారు.

ఇంకొల్లులో..

మండలంలో ముస్లింల పవిత్ర పర్వదినం బక్రీద్‌ను ముస్లిం సోదరులు అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. పండగను పురస్కరించుకొని ముస్లింలంతా సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు, ఈద్గాల వద్దకు వెళ్ళి మత పెద్దలు ప్రసంగాలను ఆలకించారు.

వేటపాలెం: మండల పరిధిలోని వివిధ మసీదుల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పండగ పురస్కరించుకొని శనివారం నవాజ్‌లు చేశారు. మసీద్ కమిటీ సభ్యు లు మాట్లాడుతూ ఈ రోజు బక్రీద్ పంగను ఈదుల్, అజహా, ఈదుల్, జహా, అని పిలుస్తారని తెలిపారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో హజ్ తీర్థయాత్ర ఈ మాసంలోనే జరుగుతుందన్నారు.

చీరాల టౌన్ : ముస్లిం సోదరుల రెండో అతి పెద్ద పండుగ అయిన బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక నవాబుపేట ఈద్గా వద్ద ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని మత పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్ద తన సందేశంతో అత్యంత ప్రీతి పాత్రమైన దానిని దైవం కోసం త్యజించడం, దైవ మార్గంలో బక్రీద్‌ను ప్రబోధించడమే నీతి సూత్రం అని పేర్కొన్నారు. ఖురాన్ చెప్పిన విధంగా నైతిక విలువలతో జీవించాలని కోరారు. అనంతరం ఖబర స్థాన్ వద్దకు వెళ్ళి పితృదేవతలను స్మరించారు. అలానే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఈపూరుపాలెంలో ముస్లిం సోదరులంతా స్థానిక ఈసూబ్‌నగర్‌లో ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

బల్లికురవ: త్యాగం, సహనం, కరుణకు ప్రతీకే బక్రీదు అని కొణిదెన ఇమాం ఆసీఫ్‌రజా అన్నారు. బక్రీదు వేడుకలు శనివారం మండలంలో వాడవాడలా ముస్లింలు ఘనంగా నిర్వహించారు. కొణిదెన, ఉప్పమాగులూరు, కొటావారిపాలెం, చెన్నుపల్లి, వల్లాపల్లి, బల్లికురవ, కొన్నిగనేనివారిపాలెం, కొప్పరపాడు, ముక్త్యేశ్వరం గ్రామాల్లో మసీదులు, ఈద్గాలను ప్రత్యేకంగా అలంకరించారు.

మేదరమెట్ల: ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను శనివారం నిర్వహించారు. పేద ధనిక తేడా లేకుండా జీవించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కొరిశపాడు మండలంలోని ముస్లిం సోదరులందరూ మేదరమెట్ల వద్ద గల పైలాన్ సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జె.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు గ్రామంలో మత పెద్దల సమక్షంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పంగులూరు, చిన్న మల్లవరం గ్రామంలో బక్రీద్ వేడుకలు జరిగాయి.



బల్లికురవ: ప్రార్థనాలు చేస్తున్న ముస్లింలు



ఇంకొల్లులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



చీరాల నవాబుపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చినగంజాంలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



దగ్గుబాడు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



నిరసన తెలియజేస్తున్న ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకులు

అద్దంకి: సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ, ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల విద్యా కేంద్రం వద్ద నిరసన శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి ఉపాధ్యాయ సంఘం నాయకులు బేతాళ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, స్కూల్ రిస్ట్రక్చర్‌లో, ఐక్య ఉపాధ్యాయ సంఘాలతో చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఎన్నో ప్రతిపాదనలు పెట్టినప్పటికీ ఒక్క ప్రతి పాదనను కూడా ఒప్పుకోకపోగా, చివరికి ఒప్పుకున్నటువంటి సెకండ్ గ్రేడు ఉపాధ్యాయుల మాన్యువల్ కౌన్సెలింగ్ కూడా నిర్వహించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన ఆందోళన గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఆలోచించి సెకండ్ గ్రేడ్‌గా ఉన్న 700 ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించకపోతే, నేడు పాత జిల్లాల్లో డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అద్దంకి మండలం ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మలాది నాగరాజు కందులు గంగాధర్, జగన్నాథం బాబురావు, కర్రీ రామయ్య చప్పుడు కేశవరావు, కోవి మల్లికార్జున రావు పాల్గొన్నారు.

10న పర్చూరులో భారీ అవగాహన ర్యాలీ



యోగాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): పర్చూరులో ఈ నెల 10వ తేదీన భారీ యోగా అవగాహన ర్యాలీ జరుగుతుందని మండల యోగా పర్యవేక్షకులు ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఉప్పుటూరు గ్రామస్తులకు యోగాపై అవగాహన కల్పించారు. మండల స్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే పోటీల్లో తప్పనసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. సోమవారం ప్రతి సచివాలయం పరిధిలో యోగా అవగాహన ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం మంగళవారం పర్చూరులో 500 మందితో భారీ యోగా అవగాహన ర్యాలీ ఉంటుందని అన్నారు. దేశంలో రోజురోజుకు కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూటమి ప్రభుత్వం కుల వివక్ష



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

మేదరమెట్ల: ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వం కుల వివక్ష చూపిస్తోందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. శనివారం కొరిశపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక దళితులతో కలిసి ప్రజాగళంపేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం దాన్ని మరచిపోయిందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వడంలో ఇవ్వడంలేదని.. సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేయకుండా ఎస్సీ, ఎస్టీల నోరు కొడుతోందన్నారు. బ్యాక్లాగ్ పోస్టుల నోటిఫికేషన్‌ను ఇంతవరకూ ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్ష్య, కార్యదర్శులు అంజయ్య, కాకుమాను రవి, దళితవేదిక కన్వీనర్ కసికుర్తి ఆమెన్‌రాజు, వీ శ్రీనివాసరావు, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట మార్చుతున్న కూటమి ప్రభుత్వం

కారంచేడు: ప్రభుత్వం ఉపాధ్యాయులు (ఎస్‌జీటీ) బదిలీ వ్యవహారంలో ముందుగా ఇచ్చిన మాటను మార్చి ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వ నేతలు మోసం చేస్తున్నారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ అని చెప్పిన ప్రభుత్వం నేడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించడంపై యూనియన్ నాయకులు మండిపడుతున్నారు. ఒంగోలు డీఈఓ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఒంగోలుకు తరలి వచ్చి కార్యక్రమంను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, రావి పద్మావతి, పావులూరి శ్రీనివాసరావు, జి. రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తెలిపారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

వేటపాలెం: ఎన్‌సీసీ శిక్షణతో నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించు కోవచ్చని మేజర్ తోట రోశయ్య పేర్కొన్నారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో 23వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కెరీర్ గైడెన్స్‌పై శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేడెట్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు, సైనిక సేవ, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ రంగం మొదలైన విభిన్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ వినేష్‌కుమార్ క్యాంపు అడ్జటెంట్ మేజర్ వై. అంజిరెడ్డి, కెప్టెన్ పాతూరి శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారులు, హరిష్, రాజేష్‌బాబు, దివ్యా, శ్రీమన్నారాయణ, శేషగిరిరావు, ఫతిమా, రమేష్, అవతార్‌సింగ్ కేడెట్స్ పాల్గొన్నారు.



ముఖ్య అతిథిని సన్మానిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



స్వామి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లో వేంచేసియున్న శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ విఠల్ స్వామి వారి దేవస్థానంలో మహా కుంభాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం నిత్యార్చన, వాస్తు పూజ, పంచామృతాభిషేకం, చతుర్ధ కలశాభిషేకం, నవ కలశ అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు.

సాయంత్రం హోమ కార్యక్రమాలు, శయనాధివాసం, హౌత్ర ప్రశంసన, సర్వదేవతా ఆవాహన హోమం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆదివారం ఉదయం 7:43 నిమిషాలకు మహా కుంభాభిషేకం, అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీపై ఊరేగించారు.